సంక్షేమ ప్రదాత సీఎం జగన్

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- కళానగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మధురవాడలో సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



కళానగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు కళానగర్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నారని తెలిపారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమం విషయంలో రెండడుగులు ముందుకేస్తే.. ఆయన తనయుడు వైఎస్ జగన్ నాలుగడుగులు ముందుకేస్తున్నారని చెప్పారు. కుల, మత, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కళానగర్ కాలనీలో ఎప్రోచ్ రోడ్డు, విద్యుత్ స్తంభాలు, లైట్లు స్థానికులు అడుగుతున్నారని, ఆ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భీమిలి నియోజకవర్గంలో 128 సచివాలయాలు ఉంటే ఇప్పటికి 40 సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలు సమస్యలు తెలుసుకున్నామని, పథకాలు అందుతున్నాయని ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని ముత్తంశెట్టి అన్నారు.

పార్కు ఆక్రమణదారులపై చర్యలు

కళానగర్‌లో 20 అడుగుల రోడ్డుతోపాటు ప్రభుత్వ పార్కును కొందరు ఆక్రమించేశారని స్థానికులు ఫిర్యాదు చేయగా.. తక్షణం చర్యలు చేపట్టాలని పీఎం పాలెం పోలీసులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి సూచించారు. జీవీఎంసీ అధికారులు కూడా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, బొట్ట అప్పలరాజు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, వివిధ విభాగాల నాయకులు చేకూరి రజని, వాండ్రాసి రవికుమార్, అల్లాడ లింగేశ్వరరావు, జగ్గపల్లి నరేష్, ఎం.వి.రమణమూర్తి, జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్.మురళీధర్, విద్యుత్ శాఖ ఏఈలు ఎస్‌వీఎస్ రామమూర్తి, శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ ఉన్నత పాఠశాల సందర్శన



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న వెంకటలక్ష్మి

భీమునిపట్నం: భీమిలిలోని పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాలను ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి ఎంపిక చేయడం కోసం శుక్రవారం విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు.. బోధన తీరును పరిశీలించారు. అలాగే పాఠశాలలో సదుపాయాలు, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ ఆధారంగా ఈ పథకానికి ఎంపిక చేస్తారని చెప్పారు. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి పాఠశాల ఎంపిక అయితే ఐదేళ్ల పాటు పాఠశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయన్నారు. దీంతో విద్యార్థులకు అదనపు వసతులు సమకూరుతాయని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి బాలాజీ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ శాశ్వత అమలుకు డిమాండ్



అంబేడ్కర్ కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దళిత ఆదివాసీ జేఏసీ సంఘాల నాయకులు

తగరపువలస: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని కోరుతూ దళిత ఆదివాసీ సంఘాల జేఏసీ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ కూడలిలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాలుగా ఉన్న ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి, అసమానతలు తొలగించడానికి గాను అత్యున్నత చట్టాన్ని రూపొందించారన్నారు. 1952, 1989 చర్చల్లో దళిత, గిరిజనుల సాధికార కోసం జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయింపునకు అప్పటి కేంద్ర ప్రభుత్వాలు స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ చట్టాలను రూపొందించాయన్నారు. అప్పట్లో ఏ రాష్ట్రం కూడా దీనిని పట్టించుకోలేదన్నారు. దళిత గిరిజన సంఘాల ఆందోళనల కారణంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 జనవరి 23న పదేళ్ల కాలపరిమితితో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని చేసి గవర్నర్‌చే ఆమోదింపచేశారని గుర్తుచేశారు. ఈ పరిమితి ఈ నెల 23తో ముగుస్తున్నందున దీనిని శాశ్వతంగా అమలు చేయాలన్న డిమాండ్‌తో ప్లకార్డులు ప్రదర్శించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దళిత ఆదివాసీ సంఘాల జేఏసీ కన్వీనర్ పతివాడ రాంబాబు, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి, గాధం మహేష్, రాజు, కరుణ, గంధవరపు కృష్ణ, శివ, పందిరి కన్నారావు, మద్దిల సుబ్బారావు, నరసింగరావు, ఈశ్వరరావు, రామకృష్ణ, నరవ రామారావు, సంతోష్‌కుమార్, దేవుడు, దండి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర స్వామికి సమర్పించేందుకు వస్త్రాలను తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ టీటీడీ అర్చకులు పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

నేటి నుంచి వికాస తరంగిణి శిక్షణ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట వారీజా నేత్ర విద్యాలయంలో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు త్రిదండి చినజియార్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో వికాస తరంగిణి కార్యకర్తల శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు శ్రీకాంతాచార్యులు తెలిపారు. రెండు రోజుల పాటు చినజియార్ స్వామి ఇక్కడే ఉంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థి లీలా తల్లి రీనాకు నగదు అందిస్తున్న బాలా–వేణు ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు

తగరపువలస: భీమిలికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని లీలా దెబోరా బెంగళూర్‌లోని ఇంటర్వ్యూకు హాజరు కావడానికి తగరపువలసకు చెందిన బాలా–వేణు ఫ్రెండ్స్ గ్రూప్ ప్రతినిధులు శుక్రవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 27న నేవీకి సంబంధించి ఉద్యోగం కోసం బెంగళూర్ ఎస్ఎస్‌బీలో ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంది. అయితే కుటుంబ నేపథ్యం తెలుసుకున్న గ్రూపు ప్రతినిధులు ఈ సాయాన్ని ఆమె తల్లి రీనాకు అందించారు. కార్యక్రమంలో వుయ్ కేర్ యు సొసైటీ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి, ఫ్రెండ్స్ గ్రూప్ ప్రతినిధులు వేణు, బాలా, కిరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ లక్ష్మణమూర్తి

భీమునిపట్నం: మానవ హక్కులు, వాటి ఆవశ్యకత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సీఐ కొండపల్లి లక్ష్మణమూర్తి అన్నారు. శుక్రవారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. చాలా మందికి తమ హక్కుల గురించి అవగాహన లేక అనేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. వాటి గురించి తెలుసుకుంటే హక్కుకు భంగం కలిగితే న్యాయం కోసం యంత్రాంగాన్ని ఆశ్రయించే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ముసునూరి శ్రీనివాస్, కాళ్ల సన్నీ, పిట్టా సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

వెంకటరావుకు పరామర్శ

పద్మనాభం: అనారోగ్యంతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పద్మనాభం మండల బీజేపీ ఉపాధ్యక్షుడు వాడపల్లి వెంకటరావును శుక్రవారం ఆ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్‌ను వీరు కోరారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



మధురవాడ కూడలి వద్ద రోడ్లు పరిశీలిస్తున్న సీఐ సాయి

మధురవాడ: మధురవాడలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు ఇటీవల బాధ్యతలు చేపట్టిన పీఎం పాలెం ట్రాఫిక్ సీఐ ఎన్.సాయి తెలిపారు. శుక్రవారం చంద్రంపాలెం హైస్కూల్ మెయిన్ గేట్, మధురవాడ బస్టాప్ పరిసరాలు, రైతు బజార్, కొమ్మాది కూడలి తదితర ప్రాంతాల్లో రోడ్లు, ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌ను మరింత క్రమబద్ధీకరించి, ప్రమాదాలు లేకుండా, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూసేందు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. మధురవాడ ఆర్టీసీ బస్టాప్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మార్పులు చేసే విధానాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ మురళీ కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

తగరపువలస: పాలిథిన్ సంచులు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక బైపాస్‌రోడ్డులోని జీడిపప్పులు, ఇతర డ్రైఫ్రూట్స్ విక్రయించే దుకాణాల్లో జీవీఎంసీ అధికారులు తనిఖీ చేశారు. ఈ నెల 23 తర్వాత పాలిథిన్ సంచులను అనుమతించబోమని హెచ్చరించారు. దీనిపై వ్యాపారులు మాట్లాడుతూ 75 మైక్రాన్ల కంటే ఎక్కువ సాంద్రత కలిగిన సంచులనే వినియోగిస్తున్నామన్నారు. జీడిపప్పు, తాండ్ర, పిస్తా, బాదం, వాల్‌నట్, గుమ్మడి, సన్‌ఫ్లవర్, దోస, ఆక్రూట్, అంజీర, ఖర్జూరం తదితర డ్రైఫ్రూట్స్ పాలిథిన్ సంచుల్లో లేకపోతే గాలికి త్వరగా పాడైపోతాయని వాపోతున్నారు. వీటిని గుడ్డ, కాగితపు సంచుల్లో ప్యాకింగ్ చేయడానికి వీలుకాదని అంటున్నారు. నగరంలో అనుమతించినట్టుగానే తగరపువలసలో కూడా 75 మైక్రాన్ల కంటే ఎక్కువ సాంద్రత గల పాలిథిన్ వినియోగానికి అనుమతించాలని కోరారు.

సుఖీభవ కాలనీలో అంధకారం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డులకు చెందిన చిట్టివలస సుఖీభవ కాలనీలో నెలరోజులుగా వీధిలైట్లు వెలగక అంధకారం అలముకుంది. కాలనీలో 25 వరకు విద్యుత్ స్తంభాలు ఉండగా.. వీటిలో ఒకదానికి ఒకటి సంబంధం లేకుండా కేవలం మూడు లైట్లు మాత్రమే వెలుగు తున్నాయి.

కాలనీని ఆనుకుని చిట్టివలస పెద్ద చెరువు, ఖాళీ లేఅవుట్లు, వ్యవసాయ భూములు ఉన్నందున విష సర్పాలు, తేళ్ల సంచారం కాలనీలో ఎక్కువగా ఉంది. కాలనీలో ఎక్కువ మంది దివీస్ లేబరేటరీ ఉద్యోగులు ఉన్నారు. వీరు మూడు షిఫ్టుల్లో ఉద్యోగం నిమిత్తం పగలు, రాత్రి తేడా లేకుండా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో చీకటి పడిన తరువాత విష పురుగులు కాళ్ల కింద పడుతున్నాయి. ఇంటి ముందు లైట్లు వేసుకున్నా రహదారుల వైపు చీకటిగా ఉండటంతో బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు.

జీరుపేటను ఆనుకుని చిట్టివలస జ్యూట్‌మిల్లు గోడ వరకు ఉన్న బొగ్గు రోడ్డులో కూడా సక్రమంగా వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో ఈ రహదారిలో రాకపోకలు సాగించేవారు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. భీమిలి జోన్ ఇంజినీరింగ్ అధికారులు తక్షణం స్పందించి సుఖీభవ కాలనీతోపాటు బొగ్గు రోడ్డులో వీధిలైట్లను పునరుద్ధరించాలని ఈ రెండు వార్డుల ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర



యాత్ర నిర్వహిస్తున్న యువకులు

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఇంధన సంరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు కోల్‌కతాకు చెందిన యువకులు సర్దార్, మింటుదాస్ కోల్‌కతా నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌కు చేరుకున్న వీరు కాసేపు విశ్రాంతి తీసుకుని పర్యాటకులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. 18 రోజుల కిందట సైకిల్ యాత్ర ప్రారంభమైందని ఒడిశా మీదుగా రుషికొండ చేరుకున్నట్లు తెలిపారు. అనంతరం తమిళనాడు, కేరళ, గోవా, గుజరాత్ తదితర రాష్ట్రాల మీదుగా ఈ యాత్ర కొనసాగించి, ఈ ఏడాది చివరికల్లా మరలా కోల్‌కతా చేరుకోనున్నట్లు వీరు తెలిపారు.

ఎండాడ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. గత నెల భీమిలిలో జరిగిన స్కూల్ గేమ్స్ విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి నెట్ బాల్ క్రీడల్లో అండర్ -14 బాయ్స్ అండ్ గరల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో, అండర్ – 17 బాయ్స్ విభాగంలో తృతీయ స్థానం సాధించారు. దీంతో ఈ పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. వీరంతా ఈ నెల 21, 22, 23 నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి నెట్ బాల్‌లో పాల్గొననున్నట్టు చెప్పారు.

పలకలు శిథిలం



తాళ్లవలస ఎస్సీ కాలనీ వద్ద శిథిలమైన పలక



గొల్లల తాళ్లవలస సర్వీస్ రోడ్డులో ధ్వంసమైన డ్రైనేజీ శ్లాబు

తగరపువలస: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్‌రోడ్డులో పలుచోట్ల డ్రైనేజీలపై సిమెంట్ శ్లాబులు, పలకలు ధ్వంసమయ్యాయి. ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రధానంగా కాలినడకన రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. భీమిలి మండలం గొల్లల తాళ్లవలస ఇరువైపులా మొదలుకుని చిట్టివలస ఈఎస్ఐ, సంగివలస కాలనీ వరకు పలుచోట్ల డ్రైనేజీపై వేసిన పలుకలు శిథిలమయ్యాయి. చాలా చోట్ల సిమెంట్ పలకలు సరిగ్గా అమర్చకపోవడంతో డ్రైన్లలో పడిపోయాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పబ్లిక్ డిమాండ్

అప్పికొండ వీధిలో చీకట్లు



భీమిలి అప్పికొండ వీధిలో వెలగని వీధిలైటు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 3వ వార్డు అప్పికొండ వీధిలో కొంత కాలంగా వీధిదీపాలు వెలగడం లేదు. 133ఏ3/3/2 నుంచి మిగిలిన స్తంభాల వరకు చీకటిగా ఉంటున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంది. రాత్రివేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికే సచివాలయం, భీమిలి జోనల్ కార్యాలయంలో ఫిర్యాదులు చేశాం. వెంటనే స్పందించి వీధిలైట్లు పునరుద్ధరించగలరు.

– సిహెచ్.రామ్‌కుమార్, భీమిలి

లక్ష్మివానిపాలెంలో వెలగని వీధిలైట్లు



లక్ష్మివానిపాలెంలో వెలగని విద్యుత్ లైటు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం, లక్ష్మివానిపాలెంలో కొంత కాలంగా వీధిలైట్లు వెలగడం లేదు. 45ఏ/16/2/4 స్తంభం నుంచి దారి పొడవునా చీకటిగా ఉంటుంది. ఈ ప్రాంతంలో అంధకారం కారణంగా రాత్రి వేళ రాకపోకలకు తంటాలు పడుతున్నాం. మధురవాడ జోనల్ అధికారులు స్పందించి వీధిదీపాలను పునరుద్ధరించాలి.

– యేసురాజు, లక్ష్మివానిపాలెం

రైళ్ల పరిశుభ్రతకు సహకరించండి

ప్రయాణికులకు డీఆర్ఎం విజ్ఞప్తి



డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైళ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సహకరించాలని, ఇది అందరి బాధ్యతని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్న వందేభారత్ రైలును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు హౌస్‌కీపింగ్ సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నా కూడా విశాఖకు చేరేసరికి పలు కోచ్‌ల నిండా ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్ కప్స్, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేసి ఉన్నాయని చెప్పారు. పరిస్థితిని చూసిన డీఆర్ఎం స్పందిస్తూ డోంట్ బీ బిట్టర్–స్టాప్ ద లిట్టర్ అని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ప్రతిష్టాత్మక వందే భారత్ రైలు శుభ్రంగా ఉంచాలని, దీనికోసం డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారని తెలిపారు.

రోడ్డు అధ్వానం.. రాకపోకలకు కష్టం



పాత కొవ్వాడ వద్ద శిథిలమైన రోడ్డు



అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

పద్మనాభం: మండలంలోని పాత కొవ్వాడ నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నారాయణపురం వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆరు కిలోమీటర్లు నిడివి గల ఈ మార్గం శిథిలమైంది. ఈ రోడ్డుపై పద్మనాభం మండలంలోని పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, తిమ్మాపురం, గంధవరం, విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నారాయణపురం, పెదరావుపల్లి, కాటికాపల్లి ప్రాంతాలకు ఆటోలు, ద్విచక్ర వాహన వాహనాలు, లారీలు తిరుగుతూ ఉంటాయి. 40 టన్నుల బరువుతో లారీలు నిరంతరం తిరగడం వల్ల రోడ్డు రోజుకూ గుంతలమయం అవుతుంది. రోడ్డంతా గోతుల మయంగా తయారవడంతో ద్విచక్ర వాహన చోదకులు, ఆటోల్లో ప్రయాణించే వారు ప్రమాదాల పాలవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

రోడ్డు అభివృద్ధి చేసేందేకు ప్రతిపాదనలు శాఖ ఉన్నతాధికారులకు పంపించాం. పాత కొవ్వాడ నుంచి ఆరు కిలోమీటర్లు నిడివి వరకు రూ.3 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– లలిత, ఆర్‌అండ్‌బీ ఏఈ

గాంధీ అధ్యయన కేంద్రం సందర్శన



రావుకు జ్ఞాపిక బహూకరిస్తున్న చల్లా రామకృష్ణ

ఏయూ క్యాంపస్: జపాన్‌కు చెందిన శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త డాక్టర్ ఎస్‌వీఎస్ రావు శుక్రవారం ఏయూలోని గాంధీ అధ్యయన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ జపనీయులు గాంధీజీ పని సంస్కృతిని అనుసరిస్తా రని చెప్పారు. విద్యార్థుల్లో గాంధేయ ఆలోచనలు, సిద్ధాంతాలను ప్రోత్సహిస్తున్న వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డిని అభినందించారు. మహాత్మా గాంధీపై ఫారినర్స్ వ్యూస్ అనే పుస్తకాన్ని డాక్టర్ రావుకు గాంధీయన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.కిషోర్‌కుమార్, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న అధికారి ఉమాదేవి

ఏయూ క్యాంపస్: అవగాహన, అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వాణిజ్య అధికారి ఎం.బి ఉమా దేవి చెప్పారు. శుక్రవారం సాయంత్రం బీచ్‌రోడ్డు లోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో విద్యార్థులకు ఇంట్లో గ్యాస్‌స్టవ్ వినియోగం–తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ స్టవ్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న పొరపాటు జరిగినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సంస్థ ప్రాంతీయ అధికారి జోషి మాట్లాడుతూ ప్రమాదానికి దారితీసే సందర్భాలు, కారణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తేజ, మనోరమ, సూర్యారావు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి పాల్గొన్నారు.